క్లుప్తంగా

కమ్యూనిజం ప్రత్యేక సంచిక ఆవిష్కరణ


సంచికను ఆవిష్కరిస్తున్న కమ్యూనిస్టు నాయకులు

కర్నూలు(సెంట్రల్): సీపీఐ శత జయంతి ఉత్సవాలను దృష్టిలో ఉంచుకొని రూపొందించిన కమ్యూనిజం ప్రత్యేక సంచికను ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య ఆవిష్కరించారు. గురువారం సీఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సంచికను ఆవిష్కరించి మాట్లాడారు. సీపీఐ ఆవిర్భవించి 100 సంవత్సరాలు కావడం సంతోషకరమన్నారు. ఈ నూరేళ్లలో అనేక పోరాటాలు, వాటి విజయాలను సంచికలో పొందుపరచినట్లు చెప్పారు. సీపీఐ నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డి,నాయకులు మహేష్, అమినాబీ, శ్రీనివాసులు, చంటి, మునిస్వామి,మల్లికార్జున, రాముడు పాల్గొన్నారు.

ఆరోగ్య సంపద దినోత్సవం


ప్రదర్శనలిస్తున్న విద్యార్థులు

కర్నూలు (సిటీ): స్థానిక ఎ.క్యాంప్‌లోని మాంటిస్సోరి స్కూల్‌లో గురువారం ఆరోగ్య సంపద దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు ఆరోగ్య సంరక్షణకు సంబంధించిన అంశాలపై సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని, ఆరోగ్యకరమైన వాతావరణం ఉండేలా బాధ్యతగా వ్యవహరించాలని తల్లిదండ్రులకు సందేశం ఇచ్చారు. స్కూల్ ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

హాస్టళ్లను శుభ్రంగా ఉంచాలి


విద్యార్థినుల మెస్‌ను పరిశీలిస్తున్న వీసీ ఎన్‌టీకే నాయక్

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయంలోని హాస్టళ్ల పరిసరాలను ఆహ్లాదంగా తీర్చిదిద్దాలని వర్సిటీ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్ అన్నారు. గురువారం వర్సిటీలోని మెన్స్, ఉమెన్స్ హాస్టళ్లను రిజిస్ట్రార్ డాక్టర్ విజయకుమార్ నాయుడుతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టళ్ల పరిసరాలు, వంటగదులు, స్టోర్ రూమ్స్, మెస్ హాళ్లను తనిఖీ చేశారు. హాస్టళ్లలో విధులు నిర్వహించే సిబ్బంది, విద్యార్థులు బాధ్యతతో మెలగాలన్నారు. వర్సిటీ అభివృద్ధి, హాస్టళ్ల పరిసరాలను ఆహ్లాదకంగా తీర్చిదిద్దేందుకు వర్సిటీ అధికారులకు సహకరించాలన్నారు.

సబ్ జైలు సందర్శన


మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి

ఆదోని రూరల్: పట్టణంలోని సబ్‌జైలును గురువారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి సందర్శించారు. సబ్‌జైలులోని ఖైదీల వివరాలు, ఖైదీలకు అందించే భోజన సదుపాయాలను స్వయంగా పరిశీలించి జైలు పర్యవేక్షణ అధికారిని అడిగి తెలుసుకున్నారు. ఖైదీలకు ఉచిత న్యాయసేవల గురించి వివరించారు. 70 సంవత్సరాలు పైబడిన మరియు ప్రాణాంతక, అనారోగ్య ఖైదీల వివరాలను సేకరించారు. కార్యక్రమంలో డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఎం.శివరామచంద్ర, ఆదోని సీనియర్ సివిల్ జడ్జి యజ్ఞ నారాయణ, డా.జగదీష్, న్యాయవాది ఆనంద్, జైలు సూపరింటెండెంట్ డా.జగదీష్ పాల్గొన్నారు.

రైతుబజారులో దళారుల ఇష్టారాజ్యం

- బోర్డుపై రాసిన ధరలను పట్టించుకోరు
- తూకాలు సక్రమంగా వేయరు
- ప్రశ్నించిన వారిపై దూషణలు, చీవాట్లు
- మహిళా వినియోగదారుపై చేయి చేసుకున్న ఓ వ్యాపారి


మార్కెటింగ్ శాఖ ఏడీ నారాయణమూర్తికి భర్తతో కలిసి ఫిర్యాదు చేస్తున్న జైనాబీ

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు సి.క్యాంపు రైతుబజారులో కూరగాయలు, ఆకుకూరలు విక్రయిస్తున్న వ్యాపారులు వినియోగదారులను దుర్భాషలాడటం, దూషించడం, చివరికి చేయి చేసుకోవడం వంటి వాటికి కూడా పాల్పడుతున్నారు. పేరుకే రైతుబజారు అయినప్పటికీ దళారులు ఇక్కడ తిష్ట వేశారు. వినియోగదారుల పట్ల అమర్యాదగా వ్యవహరిస్తున్నారనే ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. తూకాల్లో దగా చేయడం, బోర్డుపై రాసిన ధరల కంటే ఎక్కువకు విక్రయించడం నిత్యకృత్యం అయ్యింది. బోర్డుపై రాసిన ధరలను దళారీలు పట్టించుకున్న పాపన పోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కూరగాయలు, ఆకుకూరలు, కొత్తిమీర, కరివేపాకు వంటివి వారు ఇచ్చినవే తీసుకోవాలి. మంచివి ఏరుకోవడానికి ఏ మాత్రం అంగీకరించారు. పొరపాటున మంచివి ఏరుకోవడానికి ప్రయత్నిస్తే బూతులు తిడుతారు. అవమానకరంగా మాట్లాడతారు. చేయి చేసుకోవడానికి కూడా సిద్ధంగా ఉంటారు. రైతుబజారులో నిజమైన రైతులు ఉంటే ఇటువంటి పరిస్థితులు ఉండవు. రైతుబజారు నిండా దళారులే ఉండటం వల్ల ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రైతుబజారు ఎస్టేటు అధికారి, ఇతర సిబ్బంది దళారులను కట్టడి చేసేందుకు ప్రయత్నిస్తే వారిపైనే ఎదరు తిరుగుతున్న సందర్భాలు కూడా ఉన్నాయి. దళారులను బలవంతంగా బయటికి పంపితే టీడీపీ నేతలతో ఫోన్ చేయించి 10 నిమిషాల్లో లోపలికి వస్తుండటం గమనార్హం.

మహిళా వినియోగదారుపై చేయిచేసుకున్న వైనం

రైతుబజారులో గురువారం ఒక మహిళా వ్యాపారి వినియోగదారుపై చెయ్యి చేసుకున్న వ్యవహారం కలకలం రేపింది. జైనాబీ అనే మహిళ కూరగాయల కోసం రైతుబజారుకు వెళ్లారు. కరివేపాకు తీసుకునేందుకు వరలక్ష్మి అనే వ్యాపారి వద్దకు వెళ్లారు. మంచి కట్ట తీసుకునేందుకు ప్రయత్నించగా జైనాబీని తీవ్రంగా దుర్భాషలాడారు. అంతేగాక ఆమెపై చేయి చేసుకోవడం గమనార్హం. సాటి వినియోగదారుల సమక్షంలోనే ఇది జరగడం తీవ్ర ఆందోళన కలిగించింది. మనస్తాపానికి గురైన మహిళ తన భర్తతో కలిసి రైతుబజారు కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. అక్కడ తగిన చర్యలు తీసుకోలేదని గుర్తించి మార్కెటింగ్ శాఖ ఏడీ నారాయణమూర్తికి ఫిర్యాదు చేశారు. రైతుబజారులోని వ్యాపారులు వినియోగదారుల పట్ల అమర్యాదగా వ్యవహరిస్తున్నారని, కరివేపాకు కట్టపై చేయి వేసినందుకు వరలక్ష్మి అనే వ్యాపారి దుర్భాషలాడటంతో పాటు చేయి చేసుకున్నారని ఏడీకి వివరించారు. సదరు వ్యాపారిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

22న అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్): స్థానిక బి.క్యాంపు సిల్వర్ జూబ్లీ క్రీడా మైదానంలో ఈనెల 22వ తేదీన అథ్లెటిక్స్ విభాగంలో క్రాస్ కంట్రీ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు ఉమ్మడి జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి సుబ్బరత్నాలు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 గంటలకు ఈ ఎంపిక పోటీలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. ప్రతిభ కనబరచిన క్రీడాకారులను త్వరలో నిర్వహించే రాష్ట్రస్థాయి క్రాస్ కంట్రీ పోటీలకు ఎంపిక చేయనున్నట్లు వెల్లడించారు.

విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణ వద్దు

కర్నూలు న్యూసిటీ: విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణతో వినియోగదారులకు నాసిరక సేవలు, అధిక భారాలు తప్పవని ఏపీఎస్‌పీఈజేఏసీ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం విద్యుత్ ఉద్యోగ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో విద్యుత్ భవన్ వద్ద భోజన విరామ సమయంలో నిరసన వ్యక్తం చేశారు. మాట్లాడుతూ.. ఉత్తప్రదేశ్, చండీఘర్ విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణను వెంటనే మానుకోవాలని డిమాండ్ చేశారు. కార్మిక సంఘాల నాయకులు, అసోసియేషన్ నాయకులు ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య దశలోనే అనారోగ్య సమస్యలు గుర్తించాలి


పిల్లల ఎత్తు, బరువు వివరాల నమోదును పరిశీలిస్తున్న ఆర్‌బీఎస్‌కే అధికారిణి హేమలత

కర్నూలు(హాస్పిటల్): పిల్లల్లో ఐదు సంవత్సరాల లోపే మెదడు, శరీరం ఎదుగుదల ఉంటుందని, బాల్యదశలోనే అనారోగ్య సమస్యలు గుర్తించడం ద్వారా వైద్య చికిత్స అందించి పూర్తిగా సమస్యలను పరిష్కరించుకోవచ్చని రాష్ట్రీయ బాలస్వాస్థ్య కార్యక్రమం (ఆర్‌బీఎస్‌కే) అధికారిణి హేమలత చెప్పారు. గురువారం కర్నూలు నగరంలోని ఎన్‌టీఆర్ కాలనీ యూపీహెచ్‌సీ పరిధిలోని వీకర్‌సెక్షన్ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారుల స్క్రీనింగ్ కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పిల్లల బరువు, ఎత్తు తీసిన తర్వాత పోషణ లోపం ఉన్న పిల్లలను గుర్తించి వారికి పోషకాహారం అందేటట్లు చూడాలని, తీవ్ర పోషకాహార లోపం ఉన్న పిల్లలను కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని పోషకాహార పునరావాస కేంద్రం(ఎన్‌ఆర్‌సీ)కి తరలించాలన్నారు. పుట్టుకతో వచ్చే లోపాలు, విటమిన్ల వల్ల వచ్చే వ్యాధులు, పిల్లల్లో పెరిగే దశలో వచ్చే వ్యాధులు, పిల్లల్లో అవయవాల పెరుగుదల లోపించడం వంటి వ్యాధులను ఉన్నట్లు గుర్తించిన పిల్లలను పెద్దాసుపత్రిలోని డైస్ ఓపీ నెంబర్ 43కు తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో యూపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీరాములు, డైస్ మేనేజర్ ఇర్ఫాన్, ఎంపీహెచ్‌ఈవో సత్యనారాయణ, ఆరోగ్య కార్యకర్త పద్మ, ఆశా కార్యకర్త నజీమున్నీసా, అంగన్‌వాడీ టీచర్ కేజియా, ప్రాజెక్షనిస్టు ఖలీల్ పాల్గొన్నారు.

డిజిటల్ బోధనతో సత్ఫలితాలు


డిజిటల్ తరగతుల ప్రారంభోత్సవంలో పాల్గొన్న విద్యార్థుల తల్లులు

కర్నూలు సిటీ: ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ ద్వారా విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా డిజిటల్ తరగతులు ప్రారంభమవుతున్నాయని ప్రిన్సిపాల్ మహమ్మద్ అల్తాఫ్ అన్నారు. గురువారం మాధవనగర్‌లోని నారాయణ స్కూల్లోని ఎలైట్ విభాగంలో తల్లిదండ్రుల చేతుల మీదుగా డిజిటల్ తరగతులను ప్రారంభించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఆధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యార్థులకు అందించేందుకు డిజిటల్ తరగతులు చక్కగా ఉపయోగపడతాయన్నారు. దీని వల్ల విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను పెంచేందుకు అవకాశం కలుగుతుందన్నారు. స్కూల్ ఏఓ వెంకటేశ్వర్లు, వైస్ ప్రిన్సిపాళ్లు నాగేశ్వరి, రాధ, తదితరులు పాల్గొన్నారు.

భూకబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి


ధర్నా చేస్తున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, మహిళా ఐక్య వేదిక నాయకులు

కర్నూలు(సెంట్రల్): భూ ఆక్రమణలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, మహిళ ఐక్య వేదిక నగర అధ్యక్షురాలు మీసాల సుమలత డిమాండ్ చేశారు. గురువారం ఆ సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. కర్నూలు నగర శివారులోని జొహరాపురంలో దళిత భూములను కబ్జా చేస్తున్నారని, వారిపై అధికారులు చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే దాడులు చేస్తున్నారని విమర్శించారు. వెంటనే చర్యలు తీసుకోకపోతే కర్నూలు అర్బన్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని స్పష్టం చేశారు. నాయకులు జయన్న, ఆంజనేయులు, రాముడు, నాగన్న, చాంద్‌బాషా, శాలిమియా, శేషమ్మ, నీలకాంతమ్మ పాల్గొన్నారు.

జాతీయ వర్క్‌షాపును జయప్రదం చేయండి


మాట్లాడుతున్న ముజఫర్ అహ్మద్

కర్నూలు(సెంట్రల్): ఆల్ ఇండియా రోడ్డు ట్రాన్స్‌పోర్టు ఫెడరేషన్ (ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్) ఆధ్వర్యంలో జనవరి 8, 9, 10 తేదీల్లో విజయవాడలో నిర్వహించే జాతీయ వర్క్‌షాపును జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి ముజఫర్ అహ్మద్ పిలుపునిచ్చారు. గురువారం కార్మిక, కర్షక భవన్‌లో ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ రాష్ట్ర నాయకులు సురేష్ అధ్యక్షతన రాయలసీమ జిల్లాల ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా ఉన్న ట్రాన్స్‌పోర్టు కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వర్క్‌షాపులో చర్చిస్తామన్నారు. ముఖ్యంగా కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయడంపై తీర్మానం చేయనున్నట్లు చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలతో కార్మికులు రోడ్డున పడ్డారని, ఎంతో మంది ఉపాధికి దూరమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ అంజిబాబు, నాయకులు ఎల్లయ్య, వెంకటేశ్వర్లు,శివరాం, రాధాకృష్ణ,మహ్మద్ మాలిక్, రవి, కుమార్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి భరోసా

కల్లూరు: మండల పరిధిలోని రేమడూరు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త ఆర్. వెంకటేశ్వర్లు అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి గురువారం గ్రామానికి చేరుకుని కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబానికి భరోసానిస్తూ ఆర్థిక సాయం అందజేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు నారాయణరెడ్డి, రామకృష్ణారెడ్డి, చాంద్‌బాష, కార్యకర్తలు తదితరులు వెంట ఉన్నారు.

అమిత్‌షాను మంత్రివర్గం నుంచి తొలగించాలి


సుందరయ్య సర్కిల్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు


మాట్లాడుతున్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థి యువజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు భరత్‌కుమార్

కర్నూలు(సెంట్రల్): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవమానించిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాను మంత్రివర్గం నుంచి తొలగించాలని కర్నూలు నగర అధ్యక్షుడు షేక్ జిలానీ బాషా డిమాండ్ చేశారు. గురువారం ఓల్డ్‌సిటీలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట.. అమిత్‌షాకు మంచి బుద్ధిని ప్రసాదించాలంటూ కాంగ్రెస్ నాయకులు వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ.. భారత రాజ్యాంగాన్ని రచించిన అంబేడ్కర్‌ను అవమానించిన అమిత్‌షాను దేశ ప్రజలు క్షమించరన్నారు. అతన్ని మంత్రి వర్గం నుంచి తొలగించే వరకు పోరాటాన్ని ఆపమన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి దేశ నాయకులంటే గౌరవం లేకుండా పోయిందని, నిత్యం వారిని అవమానపరుస్తున్నారని చెప్పారు. మాజీ మంత్రి మారెప్ప, మాజీ ఎమ్మెల్సీ సుధాకర్‌బాబు పాల్గొన్నారు.

– డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవమానించేలా మాట్లాడిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా క్షమాపణ చెప్పాలని పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు రమణ కుమార్ గురువారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. దేశంలో ఏదో రకంగా దళిత, గిరిజన వర్గాలను అవమానిస్తున్నారని, హోంమంత్రి అమిత్‌షా పార్లమెంట్ సాక్షిగా అంబేడ్కర్‌ను అవమానించేలా మాట్లాడటం సరికాదన్నారు. ఆయన్ను మంత్రి పదవి నుంచి తప్పించాలని డిమాండ్ చేశారు.

అమిత్‌షా ఫొటోలు దహనం

పార్లమెంట్ సాక్షిగా బాబాసాహెబ్ అంబేడ్కర్‌ను అవమానపరిచేలా మాట్లాడిన అమిత్‌షాను భర్తరఫ్ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ డిమాండ్ చేశారు. గురువారం సుందరయ్య జంక్షన్‌లో అమిత్‌షా ఫొటోలను సీపీఎం నాయకులు దహనం చేశారు. ఆయన మాట్లాడుతూ.. రాజ్యాంగానికి సంబంధించి చర్చ జరుగుతున్న సమయంలో అంబేడ్కర్ పేరును పదే పదే ఉచ్చరించడంపై అమిత్‌షా చేసిన వ్యాఖ్యలు దురదృష్టకరమన్నారు. అంబేడ్కర్ పేరు ఉచ్చరిస్తేనే బీజేపీ నాయకులు ఓర్వలేకపోతున్నారన్నారు. భారత రాజ్యాంగ నిర్మాతపై బీజేపీకి ఉన్న ఉద్దేశానికి అమిత్‌షా వ్యాఖ్యలే నిదర్శమన్నారు. వెంటనే అమిత్‌షాను పార్లమెంట్‌ను నుంచి తప్పించాలని డిమాండ్ చేశారు. సీపీఎం నాయకులు టి.రాముడు, పీఎస్ రాధాకృష్ణ, ఎండీ ఆనందబాబు, నగేష్ పాల్గొన్నారు.

అమిత్‌షా క్షమాపణ చెప్పాలి

కర్నూలు సిటీ: దేశ ప్రజలందరూ దేవాలయంగా భావించే పార్లమెంటులో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవమానించేలా మాట్లాడిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా అదే పార్లమెంటులో క్షమాపణ చెప్పాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థి యువజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు వి.భరత్‌కుమార్ ఆచారి డిమాండ్ చేశారు. గురువారం స్థానిక మద్దూరునగర్‌లోని ఆ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. అంబేడ్కర్ చరిత్రను కనుమరుగు చేసేలా బీజేపీ కుట్రలు చేస్తోందన్నారు. రాజ్యాంగ రూపకర్త, దేశ ప్రజలకు రాజ్యాంగ రూపంలో స్వేచ్ఛ, సమానత్వం కల్పించిన నాయకుడు అంబేడ్కర్ అని బిజేపీ నేతలకు గుర్తుకు రాకపోవడం దారుణమని అన్నారు. ప్రపంచంలోనే అనేక దేశాలు రాజ్యాంగ నిర్మాతను నెత్తిన పెట్టుకుంటుంటే దేశంలోని నాయకులు ఇలా అవమానపరిచే విధంగా మాట్లాడుతున్నారని వాపోయారు. పార్లమెంటులో అమిత్‌షా మాట్లాడిన మాటలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆ సంఘం నాయకులు శేఖర్‌నాయుడు, మద్దిలేటి, సుంకన్న, రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌టీఈయూ చట్టానికి విరుద్ధంగా ఫీజుల వసూలు

కర్నూలు(సెంట్రల్): విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు ఉచితంగా విద్యా బోధన జరగాల్సి ఉన్నా కొన్నింటిలో తల్లిదండ్రుల నుంచి ఫీజులను డిమాండ్ చేస్తున్నారని ఎస్‌డీపీఐ జిల్లా అధ్యక్షుడు జహంగీర్ అహ్మద్ పేర్కొన్నారు. గురువారం ఫీజులు వసూలు చేస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎస్‌డీపీఐ ఆధ్వర్యంలో కలెక్టర్ పి.రంజిత్‌బాషాకు ఆయన కార్యాలయంలో వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు సంబంధించిన ఫీజులను డిసెంబర్‌లో చెల్లిస్తామని ప్రభుత్వం చెప్పినా కొన్ని పాఠశాలలు పట్టించుకోవడం లేదన్నారు. ఫీజులు చెల్లించాలని విద్యార్థుల తల్లిదండ్రులను వేధిస్తున్నాయని, వాటిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

కథా రచయిత 'వియోగి' మృతి


వియోగి (ఫైల్)

కర్నూలు కల్చరల్: ప్రముఖ హాస్యకథా, నవలా రచయిత, వియోగి కలం పేరుతో రచనలు చేసిన కోపల్లె విజయప్రసాద్ (72) మృతి చెందారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన గురువారం మధ్యాహ్నం నగరంలోని స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. ఆయన 1952 జులై 28న తెనాలిలో జన్మించారు. ఎల్‌ఐసీ సంస్థలో పనిచేసి 2012లో పదవీ విరమణ పొందారు. పలు నవలలు, కథా సంపుటాలు, వందకు పైగా రేడియో నాటికలు రాసి ఎన్నో బహుమతు అందుకున్నారు. కథా సంకలనాలు, హాస్య కథా సంకలనాలకు సంపాదకత్వం వహించారు. ఆకాశవాణి జాతీయ అవార్డు, రాధాకృష్ణన్ స్మారక అవార్డు, ఎన్టీఆర్ అవార్డు, 2016లో లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డు, 2017లో కువైట్ తెలుగు కళా సమితి అవార్డును అందుకున్నారు. వివాహ వీణ, ధీరనారి, బతుకు నవలలు, విలువలు, రసగుళికలు, మా బామ్మ కథలు, ప్రసిద్ధిగాంచాయి. వియోగి మృతికి సాహితీ స్రవంతి రాష్ట్ర నాయకుడు కెంగార మోహన్, జంధ్యాల రఘుబాబు, జిల్లా నాయకులు ఆవుల బసప్ప, చక్రపాణి, నాగమణి, అయ్యన్న, భాస్కర్, విజయులు, అరసం నాయకులు జహీర్ అహ్మద్, పుల్లా రామాంజనేయులు, ప్రమోద్, టీజీవీ కళాక్షేత్రం అధ్యక్ష కార్యదర్శులు పత్తి ఓబులయ్య, మహమ్మద్ మియ్యా, రచయితలు, కవులు తదితరులు సంతాపం ప్రకటించారు.

రెవెన్యూ సదస్సుకు 85 దరఖాస్తులు

కర్నూలు(రూరల్): మండల పరిధిలోని ఉల్చాల గ్రామంలో గురువారం తహసీల్దార్ వెంకటలక్ష్మి రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ప్రజలు వివిధ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తహసీల్దార్‌కు వినతి పత్రాలు అందజేశారు. ఉల్చాల గ్రామంలో శ్మశాన వాటికి చాలా చిన్నదిగా ఉందని, స్థలం కేటాయించాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర వినతి పత్రం అందజేశారు.

వంద రోజుల ప్రణాళిక లక్ష్యాలను సాధించాలి


సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్


పాల్గొన్న అధికారులు

కర్నూలు (సెంట్రల్): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న వంద రోజుల ప్రణాళిక లక్ష్యాలను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో 2025 జనవరి నుంచి మార్చి వరకు రూపొందించుకున్న వంద రోజుల ప్రణాళికపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా తగిన కార్యాచరణ రూపొందించాలని జెడ్పీ సీఈఓ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈలను ఆదేశించారు. ఈ ప్రణాళికలు సంబంధిత సబ్ కలెక్టర్లు, ఆర్డీఓల ఆమోదంతో రావాలన్నారు. ఏపీ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టుకు సంబంధించి రైతు రిజిస్ట్రేషన్లు 90 శాతం పూర్తయ్యాయని, డిసెంబర్ ఆఖరులోపు 100 శాతం సాధించాలని ఏపీ ఎంఐపీ పీడీ ఆదేశించారు. అటవీ శాఖకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న కంటూర్ ట్రెంచ్ పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. నగర కార్పొరేషన్, మున్సిపాలిటీల్లో నగర వనాలు, నగర వాటికల ఏర్పాటుకు స్థలాలను గుర్తించాలని మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. పరిశ్రమలకు సంబంధించి ఎంఎస్ఎంఈ సర్వేను త్వరగా పూర్తి చేసేలా ఎంపీడీఓలు తగిన ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. ఆర్‌అండ్‌బీకి సంబంధించి ప్యాచ్ వర్క్ పనులను సంక్రాంతి లోపు పూర్తి చేయాలన్నారు. గిరిజన సంక్షేమ పాఠశాలలకు కాంపౌండ్ నిర్మాణాలకు అనుమతులు ఇచ్చి రెండు నెలలు పూర్తయినప్పటికీ పనులను ప్రారంభించకపోవడం ఏమిటని అధికారులను ప్రశ్నించారు. సివిల్ సప్లయ్ శాఖకు సంబంధించి ఎఫ్‌పీ షాపుల డీలర్లను నియమించేందుకు ఎందుకు జాప్యం జరుగుతుందని డీఎస్ఓను ప్రశ్నించారు. కర్నూలు, ఎమ్మిగనూరు, ఆదోని, గూడూరు మున్సిపాలిటీలకు సంబంధించి మున్సిపాలిటీ లేదా లోకల్ ఫండ్స్ ద్వారా ప్యాచ్ వర్కులను పూర్తి చేయాలన్నారు. ఉపాధి హామీ పనులకు సంబంధించి బ్లాక్ ప్లాంటేషన్ పనులను వేగవంతం చేయాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను వెంటనే పూర్తి చేయాలని, కోర్టు కేసులను నిర్లక్ష్యం చేయకూడదని, ప్రొసీజర్ ప్రకారం వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. వచ్చే వారం నుంచి స్పెషల్ ఆఫీసర్లకు కేటాయించిన ప్రదేశాలకు వెళ్లి తనకు నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. డీఆర్వో సి.వెంకటనారాయణ పాల్గొన్నారు.

మెరుగైన సేవలందించడమే లక్ష్యం

ప్రజలకు మరింత మెరుగైన, నాణ్యమైన సేవలను చేరువ చేయడమే సుపరిపాలన లక్ష్యమని కలెక్టర్ రంజిత్‌బాషా పేర్కొన్నారు. గురువారం గుడ్ గవర్నెన్స్ వీక్ – గ్రామాల వైపు పరిపాలన కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్‌లో ప్రజల నుంచి వినతులు స్వీకరించినట్లు ఆయన చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కలెక్టరేట్‌లోపాటు అన్ని మండలాలు, డివిజన్ కేంద్రాల్లోని ప్రజల నుంచి వినతులను స్వీకరించేందుకు ప్రత్యేక డెస్కులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సమస్యలతో ఇబ్బంది పడుతున్న ప్రజలు తమ వినతులను ఇచ్చుకోవాలని సూచించారు. అంతకుముందు గుడ్ గవర్నెన్స్ వీక్–గ్రామాల వైపు పరిపాలన కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా వర్చువల్‌గా ఢిల్లీ నుంచి ప్రారంభించారు. డీఆర్వో సి.వెంకటనారాయణమ్మ, జిల్లా ఉపాధి కల్పన అధికారి దీప్తి, సీపీఓ కార్యాలయ ఏడీ భారతి పాల్గొని వీక్షించారు.

ఓపీ సేవలకు ఆధార్‌తో రావాలి

- ప్రతి సోమవారం మోకాలి కీళ్ల మార్పిడి ఆపరేషన్
- మార్చి నుంచి స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో పూర్తిస్థాయి వైద్యసేవలు
- పెద్దాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు

కర్నూలు(హాస్పిటల్): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ–హాస్పిటల్ అమలును పక్కాగా నిర్వహించేందుకు కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు వచ్చే ప్రతి ఒక్కరూ ఆధార్‌కార్డు, అభాకార్డు, ఎన్‌టీఆర్ వైద్యసేవ (ఆరోగ్యశ్రీ) కార్డు తప్పనిసరిగా వెంట తీసుకురావాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు సూచించారు. ఆయన గురువారం మాట్లాడుతూ.. ఆసుపత్రికి ప్రతిరోజూ 2 వేల మంది దాకా ఓపీ రోగులు వస్తున్నారని, వీరందరికీ ఈ–హాస్పిటల్‌లో భాగంగా ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసుకుని ఓపీ టికెట్ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు ప్రతిరోజూ 70 నుంచి 80 శాతం మంది వివరాలు నమోదు చేస్తున్నట్లు వివరించారు. చాలా మంది వద్ద ఆధార్, అభాకార్డు, మొబైల్ ఫోన్ ఉండటం లేదన్నారు. తప్పనిసరిగా ఆధార్ నంబర్‌తో లింక్ అయిన మొబైల్ ఫోన్ ఉండాలని, ఆధార్ కార్డుతో ఈ–హాస్పిటల్ నమోదు సాధ్యమవుతుందని చెప్పారు. దీని ద్వారా ఓపీ త్వరగా ఇచ్చే వీలవుతుందన్నారు. క్యూ లైన్‌లో ఎక్కువసేపు నిలబడాల్సిన అవసరం ఉండదని, స్మార్ట్‌ఫోన్ ద్వారా డిజిటల్ అభా యాప్‌లో ఓపీ టోకెన్ నంబర్ ద్వారా ఓపీ జనరేట్ చేయించుకుని వైద్యుల వద్దకు చికిత్సకు వెళ్లవచ్చన్నారు. అభా ఐడీ కార్డు ద్వారా ఆన్‌లైన్‌లో వివరాలు నమోదైతే మళ్లీ ఎప్పుడైనా వచ్చినప్పుడు వారి పూర్వ వివరాలు అందులో ఉంటాయన్నారు. దేశంలో ఎక్కడికి వెళ్లినా అభాకార్డు ద్వారా పూర్వ ఆరోగ్య వివరాలు తెలుసుకుని వైద్యం చేయించుకునే వీలుంటుందని తెలిపారు. అభా ఐడీ కార్డు ద్వారా రోగికి సంబంధించిన వైద్యపరీక్షలు, చికిత్స సమర్థవంతంగా అందించేందుకు వీలవుతుందన్నారు.

ఆసుపత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో వచ్చే ఏడాది మార్చి నుంచి పూర్తిస్థాయిలో వైద్యసేవలు ప్రారంభమవుతాయని తెలిపారు. ఇందుకు సంబంధించి ఇన్‌స్టిట్యూట్‌లో అవసరమైన ఆక్సిజన్ పైప్‌లైన్ ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిపారు. అవసరమైన శానిటేషన్, సెక్యూరిటీ, పడకలు ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. అందులో పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించనున్నట్లు చెప్పారు. ప్రతి మంగళ, గురువారాల్లో ప్రివెంట్ క్యాన్సర్ ఓపీని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీనికి ఓపీ 222గా ఏర్పాటు చేశామన్నారు. దీంతో పాటు రెగ్యులర్ ఓపీ కూడా ఇన్‌స్టిట్యూట్ భవనంలోనే కొనసాగుతుందన్నారు.

ఆసుపత్రిలోని ఆర్థోపెడిక్ విభాగంలో ప్రతి సోమవారం మోకాలు కీళ్ల మార్పిడి ఆపరేషన్లు నిర్వహిస్తున్నట్లు డాక్టర్ కె.వెంకటేశ్వర్లు తెలిపారు. 2004లో మొదటిసారి ఓ పేద మహిళకు కీలు మార్పిడి ఆపరేషన్ చేశామన్నారు. అప్పటినుంచి అప్పుడప్పుడు కీళ్ల మార్పిడి ఆపరేషన్ చేస్తున్నామని, ఇటీవల కాలంలో రెగ్యులర్‌గా ప్రతి వారం ఒకటి చొప్పున నిర్వహిస్తున్నామన్నారు. ఆపరేషన్‌కు అవసరమైన ఇన్‌ప్లాంట్స్ సప్లయ్ లేనందున రోగులే తెచ్చుకోవాల్సి ఉంటుందన్నారు. వీటి ఖరీదు ప్రైవేటుగా రూ.50 వేల నుంచి రూ.70 వేల దాకా ఉంటుందన్నారు. ఈ ఆపరేషన్‌కు డాక్టర్ ఎన్‌టీఆర్ వైద్యసేవ పథకం లేదని, కావున ఇన్‌ప్లాంట్స్ రోగులే కొని తెచ్చుకోవాల్సి ఉంటుందని తెలిపారు.

క్యాంపస్ సెలక్షన్లలో 300 మందికి ఉద్యోగాలు

కర్నూలు సిటీ: నగర శివారులోని జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజీలో ఈ విద్యా సంవత్సరం నిర్వహించిన క్యాంపస్ సెలక్షన్లలో 300 మందికి ఉద్యోగాలు వరించినట్లు ఆ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.శ్రీనివాసరెడ్డి, ప్లేస్‌మెంట్ డీన్ డాక్టర్ కె.గోవర్ధన్ రెడ్డి తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన వారికి గురువారం ఆ కాలేజీలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో వారు పాల్గొని అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమ కాలేజీకి చెందిన 300 మంది విద్యార్థులు యాక్సెంచర్, ఎల్‌టీఐ, టీసీఎస్, కాగ్నిజెంట్ సంస్థకు, కప్టియస్, ట్రిఫెక్టా ప్రాజెక్టు ప్రైవేటు లిమిటెడ్, హీలియోస్ ఇంట్రిక్స్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థలకు ఉద్యోగాలకు ఎంపికయ్యారని చెప్పారు. ఉద్యోగాలు పొందిన వారిని ఆ కాలేజీ చైర్మన్ పి.సుబ్బారెడ్డి అభినందించారు. ఆయా విభాగాధిపతులు, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.